క్లుప్తంగా

గుండెపోటుతో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మృతి


నజీర్‌అహ్మద్ (ఫైల్)

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నజీర్ అహ్మద్(35) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నజీర్ అహ్మద్ ఉదయం ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వస్తుందనడంతో వెంటనే దహెగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రమాదేవిలు ఒడ్డుగూడకు చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు విద్యుత్ అదాలత్

తిర్యాణి: వినియోగదారుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), తిర్యాణి, లింగాపూర్ మండలాలకు సంబంధించి విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న ఆయా మండలాల వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు కౌటాలలో..

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం పరిధిలోని కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కౌటాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 22న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అదాలత్ ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నూతన విద్యుత్‌లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని టీఆర్‌నగర్, జంగంవాడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మిరాజం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

'విమర్శలు చేయడం సరికాదు'


సమావేశంలో మాట్లాడుతున్న రాజారాం

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిపై విమర్శలు చేయడం సరికాదని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఎమ్మెల్సీ వర్గీయులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిపై చేసిన ఆరోపణలు నిజం కాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుస శంకర్, యూత్ అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్, నాయకులు కుట్రంగి రామకృష్ణ, జావిద్ హుస్సేన్, రవి, సత్తయ్య, బాబురావు, విష్ణుమూర్తి, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండలాధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: కౌటాల బీజేపీ మండలాధ్యక్షుడు కుంచాల విజయ్‌ను సోమవారం రాత్రి కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మల్లయ్య, మోతిరాం, చందు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మురళీగూడ

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతగా నిలిచిన మురళీగూడ జట్టుకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రూ.20వేలు, రన్నరప్ చెన్నూర్ జట్టుకు మాజీ ఎంపీపీ సుజాత శ్రీనివాస్ రూ.10వేలు, మూడో స్థానం నక్కలపల్లి జట్టుకు వెంకటేశ్ రూ.5వేలు బహుమతిగా అందజేశారు.

సన్మార్గం దిశగా పాదయాత్ర

- ఆలయాలకు కాలినడకన భక్తులు
- 20ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
- భక్తుల సేవలో గ్రామాల ప్రజలు


కౌటాలలో అన్నప్రసాదం అందజేస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: భగవంతున్ని చేరుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కోమార్గం అనుసరిస్తారు. తీర్థయాత్రలకు కాలినడకన వెళ్లడం ద్వారా తమ భక్తి చాటుకుంటారు. ఇందుకు కిలోమీటర్ల దూరం ప్రయాసలకోర్చి తమ ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకుంటారు. సిర్పూర్ మండలం టొంకిని హనుమాన్ ఆలయం, కౌటాల మండలం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రాణహితనది తీరంలో చపరాడ హనుమాన్ ఆలయాలు ప్రసిద్ధి గాంచిన దైవ క్షేత్రాలు. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు ఈ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఈ ఆలయాల్లో నిర్వహించే ఉత్సవాలు స్థానికంగా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. చపరాడలో కార్తీక్ మహారాజ్ స్వామి ఆశీస్సులు పొందడాన్ని భక్తులు ఆనవాయితీగా మార్చుకున్నారు.

ఆలయాలకు పాదయాత్రలు

టొంకిని హనుమాన్ ఆలయం, చపరాడ ప్రశాంతధాం ఆలయాలకు ఏటా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలసంఖ్యలో పాదయాత్రగా వస్తున్నారు. జనవరి 1న చపరాడ ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహిస్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రి, నెన్నెల, వేమనపల్లి, భీమిని సమీప ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు భజన చేస్తూ పాదయాత్ర చేస్తారు. ఈ పాదయాత్రలో గ్రామాల్లో చపరాడ కార్తీక్ మహరాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తూ భక్తులకు పాదయాత్ర విశిష్టతను వివరిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంతో 23 పాదయాత్రలు పూర్తయ్యాయి.

20 ఏళ్ల కిందటే ప్రారంభం

20 ఏళ్ల క్రితం బెజ్జూర్ మండలం ఎల్కపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో చపరాడ కార్తీక్ మహరాజ్ పాల్గొన్నారు. ఈ స్ఫూర్తితో నాడు ప్రారంభమైన పాదయాత్ర 20 ఏళ్లుగా కొనసాగుతోంది. కాగజ్‌నగర్ పట్టణంలోని భక్తుల ఆధ్వర్యంలో కార్తీకమాసంలో ఏటా టొంకిని హనుమాన్ ఆలయానికి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. 30వేలకు పైగా భక్తులు పాల్గొనే ఈయాత్రకు ప్రభుత్వ యంత్రాంగం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఇదే కార్తీక మాసం ఆఖరులో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల నుంచి టొంకిని హనుమాన్ ఆలయానికి భక్తులు పాదయాత్ర నిర్వహిస్తున్నారు.

జల్సాలకు పోకుండా..

ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిర్వహించే పాదయాత్రలు తమను సన్మార్గం దిశగా నడిపిస్తున్నాయని భక్తులు పేర్కొంటున్నారు. అట్టహాసంగా విందులు, వినోదాలతో జల్సా చేయకుండా కొత్త సంవత్సరం దైవసన్నిధిలో గడపడం తమకు మంచి చేస్తోందని భక్తులు చెబుతున్నారు. పాదయాత్రలు చేసే సమయంలో ఆయా ప్రాంతాల ద్వారా విజ్ఞానాన్ని కూడా పొందవచ్చని పేర్కొంటున్నారు. మంచి వ్యక్తులతో పరిచయాలు, సంబంధాలు పెరుగుతున్నాయని, ఆత్మవిశ్వాసం కలిగేలా ఉపకరిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యం, ఆధ్యాత్మికం కోసం చేసే పాదయాత్రలు తమను సన్మార్గం వైపు నడిచేలా చేస్తున్నాయని చెబుతున్నారు.

పాల్గొంటున్న ప్రముఖులు

ఆయా సందర్భాల్లో నిర్వహించే పాదయాత్రలకు భక్తులు వెళ్లే మార్గాల్లో ఆయా గ్రామాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు అందించడం, పాలు, పండ్ల పంపిణీతో పాటు అల్పాహారం, అన్నప్రసాదాలను అందిస్తున్నారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన బోనగిరి సుధాకర్ ఏటా చపరాడకు వెళ్లే భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల యువకుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు సేవలందిస్తే తమకు సంతృప్తి ఉంటోందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కాగా పాదయాత్రలో ప్రముఖులూ పాల్గొనడం విశేషం. ఎమ్మెల్యే హరీశ్‌బాబు పాదయాత్రలో పలుసార్లు చపరాడకు వెళ్లి ఆలయంలో పూజలు చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రాజకీయ ప్రముఖులు కోనేరు కృష్ణారావు, రావి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులు ఏటా పాదయాత్ర సందర్భంగా ఆలయాలను సందర్శిస్తున్నారు. ఆయా సందర్భాల్లో భక్తులకు అన్నప్రసాద పంపిణీని ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

17 ఏళ్లుగా పాల్గొంటున్నా



బెజ్జూర్ మండలం ఎల్కపల్లి గ్రామం నుంచి చపరాడ వరకు ఏటా పాదయాత్ర చేస్తున్నారు. 17సార్లు పాదయాత్రలో పాల్గొన్నాను. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. పాదయాత్రలో పాల్గొంటే జీవితంలో మార్పు వచ్చింది.

– బూరెవార్ విజయ్, బెజ్జూర్

'కార్యకర్తలకు అండగా ఉంటాం'


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, నాయకులు శ్రీవర్ధన్, తిరుపతి, రవీందర్‌గౌడ్, డబ్బా బాపు, దోని రవి పాల్గొన్నారు.

మాలీ సంఘం నాయకులకు సన్మానం


నాయకులను సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల: మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన లెండుగురే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్, జిల్లా అధ్యక్షుడు సెండే వాసు, ప్రధాన కార్యదర్శి నికోడే గంగారాంను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మాలీ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం మాలీ కులస్తుల జీవన స్థితి గతులను తెలుసుకోవడానికి ప్రత్యేక సర్వే నిర్వహించాలన్నారు. నాయకులు శ్రీనివాస్, నాందేవ్, ఆనంద్, లక్ష్మణ్, శివరాం పాల్గొన్నారు.

'శ్రీరాముడి శోభాయాత్ర విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలో గత ఏడాది జనవరి 22న కనుల పండువగా బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయం నుంచి శ్రీరాముడి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామ హిందు పరిరక్షణ సమితి కన్వీనర్ అంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వ్యాపార సంస్థలు మధ్యాహ్నం 12 గంటల వరకు బంద్ చేయాలని కోరారు.

ఆసిఫాబాద్: అయోధ్యలో బాలరాముని ఆలయ నిర్మాణం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు బోనగిరి సతీశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కౌటాల: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యులు రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, హింసలకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం ధర్మయ్య, సభ్యులు సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొంతెమ్మ బోనాలు


ఆలయం వద్ద బోనాలతో మహిళలు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దైవం గొంతెమ్మ (కుంతిదేవి) ఆలయంలో బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు, ఎస్సై కొమురయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భాజా భజంత్రీలు, డప్పుచప్పుళ్లు, కరతాల ధ్వనుల మధ్య అమ్మవారి మూర్తితో పాటు లక్ష్మీదేవరా, పంచపాండవులు, నీలవరుడు, పోతురాజు, కృష్ణస్వామి, గిరిపోతు, నిషానుల ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం


కోవ లక్ష్మికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కెరమెరి మండలం అనార్‌పల్లిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 37 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి నిర్వాహకులు సోమవారం పలువురిని ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. నిర్వాహకులు బదావత్ ధన్‌రాజ్, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి పుణ్యావచనం, ముత్యంగరణం, ధ్వజారోహణం, స్వామివారికి అభిషేకం, 10 గంటల నుంచి శ్రీపద్మావతి లక్ష్మీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, 11 గంటలకు పుష్పయాగం, ఒంటి గంట నుంచి అన్నప్రసాద వితరణ, మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామివారి రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జాదవ్ ధన్‌రాజ్, నిర్వాహకులు వెంకట్, సురేశ్, రాహుల్, విజేష్ ఉన్నారు.

విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, చరణ్, దేవాజీ, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: విశ్రాంత ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు తన నివాసంలో ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, అంకయ్య, నర్సయ్య, షేక్ మహబూబ్, ఎఎస్‌ఆర్‌మూర్తి, నర్సయ్య, ఇస్తారు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

బెజ్జూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా సర్వే వివరాలను పరిశీలించారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరి శంకర్ తదితరులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హులకు పథకాలు వర్తింపజేయాలని ఆదేశించారు.

గ్రామసభలు విజయవంతం చేయాలి


వాంకిడి: మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: మంగళవారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు నేటి నుంచి నిర్వహించే గ్రామసభల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులుగా ఉండి జాబితాలో పేర్లు రాకపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామసభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి గోపికాంత్, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం మండలంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అల్బర్ట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదిన లోడుపల్లి, బొంబాయిగూడ, పోతెపల్లి, దరోగపల్లి, అగర్‌గూడ, 22న కొండపల్లి, మురళీగూడ, కమ్మర్‌గాం, 23న ఎల్లూర్, ఎల్కపల్లి, చేడ్వాయి గ్రామాల్లో నిర్వహించనున్న గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌటాల: ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం గ్రామాల్లో నేటి నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోట ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈనెల 21న కౌటాల, గుడ్లబోరి, తాటినగర్, సాండ్‌గాం, వీరవెల్లి, ముత్తంపేట్, గుండాయిపేట్, 22న మొగడ్‌దగడ్, నాగేపల్లి, కనికి, తుమ్మిడిహెట్టి, 23న పార్డీ, బోదంపల్లి, గురుడుపేట, తలోడి, తాటిపల్లి, శీర్షా, వీర్దండి, 24న కన్నెపల్లి, బాలేపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

హెడ్‌మాస్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి


బెజ్జూర్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వాంకిడి: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, తుక్కుగూడ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎంపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఉప్రె వినేష్ డిమాండ్ చేశారు. సోమవారం వాంకిడి కలాన్ ఎంపీపీఎస్ పాఠశాల ఎదుట భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

కౌటాల: తుక్కుగూడ హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని సోమవారం మండలంలోని మొగడ్‌దగడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సోయం ఇందురావ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉపాధ్యాయులు గంగాసింగ్, సంతోష్, ఆనంద్‌రావ్, విద్య పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. టీఎస్‌టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు రాములపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్, జిల్లా నాయకులు ప్రకాశ్, శ్యాంసుందర్, మండల నాయకులు హరీశ్, భాజీఖాన్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, మాధవి, మురళి, సీఆర్పీలు రమేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖమర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రాథమికోన్నత పాఠశాల కుశ్నేపల్లె మండలం బెజ్జూర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ప్రవళిక, ప్రియాంక, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ప్రధానోపాధ్యాయులపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సోమవారం ఉపాధ్యాయులు పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న రాములుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి


మందులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం గొల్లగూడలో ప్రతిమా ఫౌండేషన్, నాబార్డు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం డీఆర్‌డీవో దత్తారావు, డీఎంహెచ్‌వో సీతారాం, నాబార్డు అధికారి కౌశిక్‌తో కలిసి మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశిబిరంలో రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులు అందించామని తెలిపారు. నాబార్డు ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందించామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం బూర్గుడ పల్లె దవాఖానాను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు, నాబార్డు, వాసన్ సిబ్బంది వీరభద్రుడు, జయవర్ధన్, సురేందర్ పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

గ్రామాల్లో అధికారులు సర్వే సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని మోతుగూడలో కొనసాగుతున్న సర్వేను సోమవారం పర్యవేక్షించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చిన్ను, ఏఈవో ఖాలీం, నాయకులు మహేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న ఆత్రం లింగోరావు

బెజ్జూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను జాతీయ మానవ హక్కుల సభ్యుడు ఆత్రం లింగోరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలతో పాటు విద్యార్థుల డైట్‌మెనూ, టీచర్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని, క్రీడా మైదానం, సోలార్ వాటర్ హీటర్ సమస్యలను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై స్పందిస్తూ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా చూస్తానన్నారు. ఆయన వెంట పెంచికల్‌పేట్ రాయిసెంటర్ సార్మేడి పోర్తేటి ప్రభాకర్, బెజ్జూర్ సార్మేడి సడ్మేక రమేశ్, రాయిసెంటర్ సభ్యులు ప్రశాంత్, సత్యవన్, గణేశ్, శ్రీహరి, సత్యం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బడి బయట పిల్లల సర్వే

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీ పరిధి కొలాంగూడలో సీఆర్పీ జాదవ్ సంజీవ్‌కుమార్ సోమవారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొలాంగూడ గ్రామానికి చెందిన బడి మానేసిన ఇద్దరు పిల్లలను గుర్తించామన్నారు. వారి వివరాలు నమోదు చేసుకున్నామని, వారిని స్థానిక కేజీబీవీలో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బడి బయటి బాలికలను కేజీబీవీలో, బాలురను గురుకుల పాఠశాలలో చేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 –19 ఏళ్ల వయస్సు గల వారు 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారిని ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్లను కల్పించడమే కాకుండా, పరీక్ష ఫీజులు సైతం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇలాంటి వారు ఉంటే 91828 95608కు సమాచారం అందించాలని సూచించారు.